క్లుప్తంగా

కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



నగరం: రామ నామస్మరణతో ఈదుపల్లి రెడ్ల పాలెం గ్రామం మార్మోగింది. నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి దేవస్థానంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి విగ్రహాలను శాస్త్రయుక్తంగా ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశేష పూజలు జరిపారు. అనంతరం సీతారాములు శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేపల్లె: పట్టణంలోని 13వ వార్డులో ఈ నెల 9న శుక్రవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించబడునని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పాల్గొని, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తారని పేర్కొన్నారు.

మున్సిపల్ ఏఈ రోహిణి బాధ్యతల స్వీకరణ



రేపల్లె: రేపల్లె మున్సిపల్ ఏఈగా రోహిణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి నుంచి సాధారణ బదిలీలో భాగంగా ఆమె రేపల్లెకు విచ్చేశారు. రేపల్లె ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్ గుంటూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను స్థానిక కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ఏఈ రోహిణి మర్యాదపూర్వకంగా ఎంపీ మోపిదేవి వెంకట రమణారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రేపల్లె మున్సిపాలిటీకి 7 ఈ–ఆటోలు

రేపల్లె రూరల్: క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యావరణ హితం కోరుతూ ప్రవేశపెట్టిన పారిశుద్ధ్య ఈ–ఆటోలు రేపల్లె మున్సిపాలిటీకి 7 మంజూరైనట్లు కమిషనర్ విజయసారథి తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పర్యావరణ హిత ఈ–ఆటోలను త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆటోల్లో డ్రైవర్‌గా పనిచేసేందుకు మహిళలకు తొలి ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు.

ఎంపీడీఓ శివపార్వతీ బాధ్యతల స్వీకరణ

రేపల్లె: రేపల్లె ఎంపీడీఓగా ఎ.శివపార్వతీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో ఏవోగా విధులు నిర్వహిస్తూ.. పదోన్నతిపై రేపల్లె ఎంపీడీవోగా విచ్చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు విధులు నిర్వర్తించారు. ఎంపీడీఓ శివపార్వతికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వేమూరు ఎంపీడీఓగా శ్రీనివాసరావు



వేమూరు : వేమూరు మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారిగా బి. శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొన్నాళ్లుగా ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉన్న నేపథ్యంలో మంగళగిరిలో పనిచేస్తున్న శ్రీనివాసరావు ఉద్యోగోన్నతిపై వేమూరు ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ తన శక్తివంచన మేరకు కృషి చేస్తానని అన్నారు.

ఐలవరానికి చేరిన జీపు జాత

భట్టిప్రోలు: కౌలు రైతుల సంక్షేమ పథకాల అమలుకు ఆటంకంగా ఉన్న 2019 పంట సాగు దారుల హక్కు చట్టంలోని భూ– యజమాని రాతపూర్వక ఒప్పందాన్ని తొలగించాలని కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తోడేటి సురేష్.. ప్రభుత్వాన్ని కోరారు. గురువారం భట్టిప్రోలు మండలం ఐలవరంలో జరిగిన జీపు జాతాలో సురేష్ మాట్లాడుతూ ఈ నెల 12న రాష్ట్ర భూ పరిపాల శాఖ అధికారులతో కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌలురైతు సంఘం నాయకులు జి. నాగరాజు, జంపాని వెంకట ప్రసాద్, గొల్ల రాంబాబు, మునిపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్.. బైక్ మిస్సింగ్

- రేపల్లె పట్టణంలో ద్విచక్ర వాహనాల చోరీలు..
- పార్కింగ్ చేసి, తిరిగి వచ్చే వరకు నో గ్యారెంటీ...
- నమోదైన కేసులు కొన్ని.. కానివి మరిన్ని
- కొరవడుతున్న పోలీసుల నిఘా..
- రాత్రి అయితే.. ఏదొక ఇంటిలో చోరీ ఖాయం..
- వరుస దొంగతనాలతో హడలెత్తుతున్న ప్రజలు



పట్టణంలోని సెంటర్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

రేపల్లె రూరల్: పట్టణంలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌లు రాత్రికి రాత్రే మాయమవుతున్నాయి. ఆదమరిస్తే.. తమ దిచక్ర వాహనాలు ఉంటాయో.. లేదోనని వాహన చోధకులు బెంబేలెత్తిపోతున్నారు. పోలీసుల నిఘా కొరవడటంతో దొంగలకు అడ్డు లేకుండా పోతోందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో పట్టణంలో పలు వాహనాలు చోరీ అయ్యాయి. ఓల్డ్ టౌన్‌లోని ఆజాద్ మున్సిపల్ స్కూల్ వీధిలో ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని రాత్రి ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి వాహనం మాయమైంది. అదే వీధిలో మరో రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం రాత్రికి రాత్రే చోరీకి గురైంది. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో, పట్టణంలోని సెంటర్ పార్కింగ్‌లో ఉంచిన వాహనాలు మాయమాయ్యాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా ద్విచక్ర వాహనాలు ఛోరీకి గురవుతుండటంతో వాహన చోధకులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాన్నా.. ఛోరీలు పెరిగిపోతూనే ఉన్నాయి. వాహనాల యజమానులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకుండా పోతోందని పెదవి విరుస్తున్నారు.

వరుస చోరీలతో భయాందోళనలో ప్రజలు:

పట్టణంలో రాత్రిళ్లు వరుస ఛోరీలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పట్టణంలోని రెడ్డిగారి మిల్లు సమీపంలోని ఓ గృహంలో, గరువు రోడ్డులోని మరో ఇంటిలో దొంగతనాలు జరిగాయి. నగదు, విలువైన వస్తువులను దుండగులు అపహరించుకుపోయారు. అదేవిధంగా పద్మావతి టాకీసు సెంటరులోని ఓ పాన్‌షాప్‌లో, నేతాజీనగర్‌లోని ఓ ఇంటిలో ఛోరీకి పాల్పడిన ఘటనలూ ఉన్నాయి. నిత్యం రాత్రిళ్లు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నామని చెబుతున్నా దొంగతనాలను అరికట్టలేకపోవటంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అరకొరగా ఫిర్యాదులు నమోదు..

ద్విచక్ర వాహనాలు పోగొట్టుకున్న బాధితులు, గృహాల్లో విలువైన వస్తువులు కోల్పోయిన వారు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. కేసులు నమోదు చేయటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దొంగలు పట్టుబడిన సందర్భాల్లో అప్పటికప్పుడు మొక్కుబడిగా కేసులు నమోదు చేసి, బాధితులకు సొత్తు రికవరి చూపుతున్నారని,పూర్తిస్థాయిలో దొంగతనాలపై పోలీసులు ఉక్కుపాద మోపుతున్న దాఖలాలు లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నమోదు కాని బైక్ దొంగతనాలు చాలానే ఉన్నట్లు సమాచారం

సమన్వయంతోనే చోరీల నియంత్రణ

పట్టణంలో ద్విచక్ర వాహనాలు ఛోరీకి గురువుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రత్యేక నిఘా ఉంచాం. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేసి, బాధితులకు న్యాయం చేస్తాం. నివాస గృహాల సమీపంలో ఎవరైనా అనుమానాస్పద స్థితిలో సంచరిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలి. యజమానులు బాధ్యతగా వాహనాలను రహదారులపై కాకుండా, గృహాల్లో భద్ర పరుచుకోవాలి. పోలీసులతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటే..ఛోరీలను నివారించగలుగుతాం.

– విజయచంద్ర, పట్టణ సీఐ, రేపల్లె

వైభవంగా రేణుకా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ ఎంపీ రాజుపాలెంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో పిట్లవారి వంశస్థుల ఇలవేల్పు శ్రీ రేణుకా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పోతురాజు స్వామి విగ్రహం ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, రేణుకా అంకమ్మ తల్లిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, టీడీపీ బాపట్ల నియోజక వర్గం ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్రవర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొని, పూజలు చేశారు.

భార్యాభర్తలను ఒక్కటి చేసిన అధికారులు



భార్యాభర్తలతో తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎస్‌ఐ శివప్రసాద్

రేపల్లె రూరల్: చిన్నపాటి మనస్పర్థలతో విడిపోయి, వేర్వేరుగా ఉంటున్న భార్యాభర్తలకు తహసీల్దారు మల్లికార్జునరావు, చోడాయపాలెం ఎస్‌ఐ శివప్రసాద్ గురువారం కౌన్సిలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు. వివరాల మేరకు.. పిరాట్లంక గ్రామానికి చెందిన హేమలతకు, చోడాయపాలేనికి చెందిన సైకిల్ మెకానిక్ కిరణ్‌కు 14 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహమైంది. వీరికి మూడేళ్ల క్రితం ఒక పాప జన్మించింది. గత ఆరు నెలల నుంచి మనస్పర్థల కారణంగా భార్యభర్తలు విడివిడిగా తమ స్వగ్రామాల్లో ఉంటున్నారు. గురువారం కిరణ్ పిరాట్లంక వెళ్లి కుమార్తె కెజీలియాను ఇంటికి తీసుకొచ్చాడు. దీంతో మనస్థాపానికి గురైన హేమలత నేరుగా 100 నంబరుకు ఫోన్ చేసి, తన కుమార్తెను భర్త తీసుకెళ్లిపోయాడని, ఆత్మహత్య చేసుకుంటానని పోలీసులకు సమాచారం అందించింది. దీంతో వెంటనే చోడాయపాలెం ఎస్‌ఐ శివప్రసాద్ బాధితురాలి గృహానికి చేరుకుని కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఆమెను చోడాయపాలెం పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. అదేవిధంగా కిరణ్, అతని కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. అప్పుడే చోడాయపాలెం సచివాలయాన్ని పరిశీలించిన తహసీల్దార్ డి.మల్లికార్జునరావు పోలీసుస్టేషన్‌ను సందర్శించేందుకు వెళ్లారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న భార్యభర్తల సమస్యను తెలుసుకుని, ఎస్‌ఐతో కలిసి భార్యభర్తలకు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న హేమలతకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.8వేలు ఆర్థిక సాయం అందజేసి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన బ్యాంక్ రుణం మంజూరు చేయిస్తామని భరోసా కల్పించారు. దీంతో హేమలత, కిరణ్ తమ తప్పు తెలుసుకుని, సర్దుకుపోయి జీవిస్తామని ఒక్కటయ్యారు. తహసీల్దార్ మల్లికార్జునరావుకు, సమస్యను పరిష్కరించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

డీఆర్‌డీఏ ఏరియా కో–ఆర్డినేటర్ రమాదేవి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏరియా కో–ఆర్డినేటర్ రమాదేవి

రేపల్లె: మహిళా సంఘాలు బలోపేతంతోనే సమాజం అన్ని రంగాల్లో ముందుంటుందని డీఆర్‌డీఏ ఏరియా కో–ఆర్డినేటర్ పి.రమాదేవి అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్, డ్వాక్రా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ట్రెనింగ్ ఫర్ విలేజ్ ఆర్గ నైజర్‌లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాలను బలోపేతం చేయాలంటే మహిళలు ముందుకు రావాలన్నారు. మహిళా మార్ట్‌ల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు లభ్యమవ్వటమే కాకుండా మార్ట్‌ల ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు. మహిళలకు సమస్యలొస్తే.. 181, 100కు ఫోన్‌ద్వారా సమాచారం అందించి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.త్యాగరాజు, చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువకుడు ఆత్మహత్య



చేబ్రోలు: ఎలుకల మందు తిని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో జరిగింది. చేబ్రోలు చెరువులోపాలెం ప్రాంతానికి చెందిన పల్లె రవి (36) కుటుంబ మనస్పర్థల కారణంగా మద్యంలో ఎలుకల మందు కలుపుకొని సేవించాడు. బంధువులు గమనించి రవిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. చేబ్రోలు ఎస్‌ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యసన సామర్థ్యం పెంపునకు బాధ్యత తీసుకోవాలి



విద్యార్థులతో మోజెస్, హెచ్‌ఎం, తల్లిదండ్రులు

బాపట్ల అర్బన్: అభ్యసన సామర్థ్యం పెంపొందించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమని అసిస్టెంట్ ఏఎంఓ బి. మోజెస్ అన్నారు. జన్ భాగిధారి కార్యక్రమంలో భాగంగా ఇస్లాంపేటలోని ఆజాద్ స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మూడు నుంచి తొమ్మిదేళ్ల వయస్సు ఉన్న పిల్లల్లో భాషపై పట్టు, గణితంపై అవగాహన పెంపొందించడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలన్నారు. సదస్సుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గజ్జి ప్రసార్య ఆక్జల్ అధ్యక్షత వహించగా, జిల్లా అధికారి సాధిక్ విద్యార్థుల పలు కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. హెచ్‌ఎం పద్య పఠనం, కథలు, చిత్ర లేఖనంపై పోటీలు నిర్వహించారు. జ్ఞాని దమక రాశులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని ఈతేరు సమీపంలో చోటుచేసుకుంది. పొన్నూరు మండల, ములుకుదురు గ్రామానికి చెందిన కట్టా మణికంఠ బాపట్ల నుంచి ములుకుదురు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈతేరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మణికంఠ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ కె. వెంకటప్రసాద్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేశారు.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలి



ఎంపీడీఓను కలిసి శుభాకాంక్షలు చెబుతున్న డీఎల్‌డీఓ, సిబ్బంది

పిట్టలవానిపాలెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మారుతీ శేషమాంబ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి సమాచారాన్ని సేకరించి, అందజేయాలని తెలిపారు. గ్రామ ప్రణాళికను తయారు చేసి తద్వారా మండల ప్రణాళిక తయారు చేసేందుకు సహకరించాలని కోరారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శులు శేషగిరి రావు, వసుంధర లక్ష్మి, సుజాత, శివకుమార్, ఐనంపూడి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

పిట్టలవానిపాలెం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా భవనం మారుతీ శేషమాంబ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పొన్నూరు ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె.. పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల ప్రజలకు.. అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాలను అర్హత కలిగిన లబ్ధిదారులకు అందేలా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓకు బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త, ఈవోపీఆర్డీ కె.పద్మజ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ కార్యదర్శులు శేషగిరిరావు, వసుంధర లక్ష్మి, ఐనంపూడి శ్రీనివాసరావు, సుజాత, శివకుమార్, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

ఆటో బ్యాటరీల దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయచంద్ర

రేపల్లె: ఆటోల్లోని బ్యాటరీలు, ఇతర వస్తువులను అపహరించిన వ్యక్తిని పెనుమూడి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ విజయచంద్ర వివరాల మేరకు.. రాచూరు గ్రామానికి చెందిన జొన్న సురేష్ అనే వ్యక్తి తన రెండు ఆటోల బ్యాటరీలు, టైర్లు, డిస్కులు, టేపు రికార్డులు అపహరణకు గురైనట్లు ఈ నెల 1న పోలీసులకు పిర్యాదు చేశాడు. దర్యాప్తు చేయగా కారుమూరు గ్రామానికి చెందిన బోగాది నాగయ్య అనే వ్యక్తి వీటిని దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. పెనుమూడి చెక్‌పోస్ట్ వద్ద నాగయ్యను గురువారం అదుపులోకి తీసుకుని అతని నుంచి నాలుగు ఆటో బ్యాటరీలు, రెండు ఆటో టైర్లు, రెండు డిస్కులు, ఒక టేప్ రికార్డును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

సముద్రం కలుషితం కాకుండా చూసుకోవాలి



బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రవీందర్, సాయిబాబు

బాపట్ల అర్బన్: వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంలో సముద్రాలు అద్భుతమైన పాత్రను పోషిస్తాయని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పి.సి.సాయిబాబు అన్నారు. అంతర్జాతీయ సాగర దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కర పత్రాలు ఆవిష్కరించారు. బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ పాల్గొని, మాట్లాడుతూ సముద్రాలు భూగోళానికి ఊపిరితిత్తుల్లాంటివన్నారు. నిమిషానికి ట్రక్కు లోడు వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయని, దీనివల్ల సముద్ర జీవులకు ఎంతో హాని కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రచార జాతలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

రేపల్లె రూరల్: మున్సిపాల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.నాగభూషణం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా నుంచి నిర్వహిస్తున్న ప్రచార యాత్ర గురువారం రేపల్లె పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులని పర్మినెంట్ చేయాలని, పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్మికులు జాని, దుర్గ, నారాయణా, వీరాస్వామి, రెబ్బాని, రాజ్యలక్ష్మి, లత పాల్గొన్నారు.

పంట కాలువను.. ఇలా చేస్తున్నారేంటీ..!



వ్యర్థాలను విడుదల చేసేందుకు రోడ్డు పక్కనే ఉన్న ట్యాంకర్



కాలువలోకి విడుదల చేస్తున్న వ్యర్థాలు

పిట్టలవానిపాలెం: చందోలు సమీపంలో తెనాలి–నిజాంపట్నం పంట కాలువలో సెప్టిక్ ట్యాంక్ నుంచి వ్యర్థాలను విడుదల చేస్తూ నీటిని కలుషితం చేస్తున్నారు. కొంతకాలంగా ఇదే విధంగా జరుగుతున్నా అధికారులు నామ మాత్రపు చర్యలు కూడా తీసుకోకపోవడం గమనార్హం. బాపట్లకు చెందిన ఓ సెప్టిక్ ట్యాంకు క్లీనర్స్.. పిట్టలవానిపాలెం–చందోలు మెయిన్ రోడ్డు పక్కనే వాహనాన్ని ఆపి డైరెక్టుగా పంట కాలువలోకి సెప్టిక్ వ్యర్థాలను విడుదల చేస్తున్నారు. దీంతో ఆ మురుగు నీరు పంట కాలువలోకి వెళ్తుంటే భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పంట కాలువ ద్వారా దిగువన గల పొలాలకు సాగు నీరు వెళ్తోంది. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షోభంలో చేనేత పరిశ్రమ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భట్టిప్రోలు: ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో చేనేత పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడుతోందని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు వాపోయారు. కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేతపై జీఎస్టీ విధించడం అమానుషమన్నారు. 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వాలు వాటికి తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్యాచరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్స్ జి. బాలాజి, ఎం. సత్యన్నారాయణ, చేనేత కార్మిక సంఘాల నాయకులు ఎం. వెంకట్రావు, డి. శ్రీనివాసరావు, డి. సత్యన్నారాయణ, బి. నాగమల్లేశ్వరరావు, కె. రామకోటేశ్వరరావు, ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.